# సత్యవాక్యం

# THE WORD OF TRUTH

క్రైస్తవ తెలుగు మాసపత్రిక

MAY - 2001

# సంక్షిప్త వార్తలు

2001 ఏప్రియల్ 11, 12 తేదీలలో అమెరికా నుండి వచ్చిన సోదరులు జె.సి.ఛోట్‌గారు, వారి సతీమణి బెట్టీ ఛోట్ గారు జాషువా గూటం గారి యింట బస చేసిరి. 11వ తేదీ సాయంత్రం కాకినాడ సత్యవాణి - క్రీస్తు సంఘములోను, 12 తేదీ ఉదయం పెద్దాపురం మండలం పులిమేరులోను, ఆ సాయంత్రం పిఠాపురంలోను వాక్య పరిచర్య చేసిరి. ముగ్గురు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి. 13వ తేదీనాడు ఛోట్ దంపతులు బెంగుళూరుకు వెళ్లిరి.

పిఠాపురం సీతయ్యతోటలోని క్రీస్తు సంఘము ఏప్రియల్ 12, 13, 14 తేదీలలో మూడురోజులు సువార్త కూటములు నిర్వహించిరి. 12వ తేదీ నాడు జె.సి.ఛోట్ దంపతులు, జాషువాగూటం దంపతులు హాజరై వాక్య పరిచర్య చేసిరి. ఛోట్‌గారి ఆంగ్ల ప్రసంగమును జాషువాగారు తెలుగున కనువదించిరి. 13వ తేదీ నాడు తుని నుండి వచ్చిన యస్.సాల్మన్‌రాజు గారు మనపట్ల దేవునికి గల శ్రద్ధ అను అంశముపై మాట్లాడిరి. 14వ తేదీనాడు రంపచోడవరం నుండి వచ్చిన జాన్‌రత్నం గారు, గోకవరం నుండి వచ్చిన సత్యనారాయణగార్లు వాక్య పరిచర్య చేసిరి. ఈ మూడురోజుల కూటముల ఫలితముగా ముగ్గురు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి. పిఠాపురం సీతయ్యతోటలోను, ఇందిరాకాలనీలోను సోదరులు వి.యేసు గారు కష్టించి సువార్త చాటుచు క్రీస్తుకొరకు మంచిపని చేయుచున్నారు.

ఏప్రియల్ 23, 24 తేదీలలో ధవళేశ్వరం ఇందిరా స్వర్ణనగర్‌లో యున్న క్రీస్తు సంఘము సువార్త కూటములు నిర్వహించిరి. సోదరులు జాషువాగూటం, టి.వి.ఎన్.కుమార్, టి.జ్ఞానానందం, యస్.జాన్‌గార్లు వాక్య పరిచర్య చేసిరి. కూటములకు అనేక మంది హాజరై దేవుని వాక్యమును వినిరి. ఆత్మీయముగా బలపడిరి. ఇక్కడ సోదరులు బి.లాజరస్‌గారు క్రీస్తు కొరకు పనిచేయుచున్నారు.

ఏప్రియల్ 25వ తేదీ బుధవారం భీమవరం గొల్లవానితిప్ప రోడ్‌లో యున్న క్రీస్తు సంఘ ఆవరణలో సువార్తికుల సదస్సు జరిగెను. ఎండలు తీవ్రముగా యున్నను పలుప్రాంతముల నుండి సువార్తికులు సకాలమునకు హాజరై సదస్సులో పాల్గొనిరి. సోదరులు జాషువాగారు అధ్యక్షులుగా యుండి సదస్సును ఘనముగా నిర్వహించిరి. మాధాపురం నుండి వచ్చిన యం.యేసుదాసు గారి ప్రార్థనతో సదస్సు ఆరంభమాయెను. సోదరులు డి.ఇశ్రాయేలు రాజు, రవికుమార్‌లు పాటలు నడిపించిరి. తదుపరి "నిజదేవుని తెలిసికొనుటయెట్లు ? ఆయన నెట్లు ఆరాధించవలెను ?" అను అంశము చర్చించబడెను. సోదరులు డి.చిరంజీవి (బండార్లంక), వి.చిన్నయ్య (కడలి), కె.దామోధరరావ్ (కోడూరు), జి.రాజారావ్ (భీమవరం), యస్.రాయప్ప గార్లు చర్చలో

# సత్యవాక్యం

**THE WORD OF TRUTH**

**P.O. Box 80, Kakinada, A.P. 533 001**

**Phone : 0884 - 363722**

**Editor :**

**JOSHUA GOOTAM**

**Pleading for Restoration of First Century Christianity**

సంపుటి 21 మే 2001 సంచిక 10


# దేవుడు ఆత్మయై యున్నాడు
## (God is Spirit)

యేసు ప్రభువు సుఖారు అను వూరిలో యాకోబు బావి దగ్గర సమరయ స్త్రీతో దేవుని గూర్చి చెబుతు, "దేవుడు ఆత్మ గనుక ఆయనను ఆరాధించువారు ఆత్మతోను సత్యముతోను ఆరాధించవలెనని" తెలియజేసెను (యోహాను 4:24). దేవుడు ఆత్మయై యున్నాడనుటలో ఆయన భావమేమిటి ? సమరయ స్త్రీతో మాట్లాడుచు, యేసు ప్రభువు, దేవుడు ఏదో ఒక కొండకు గాని, లేక ఆలయమునకు గాని పరిమితము కాడని బోధించారు. "అమ్మా ఒక కాలము వచ్చుచున్నది; ఆ కాలమందు ఈ పర్వతము మీదనైనను యెరూషలేములో నైనను మీరు తండ్రిని ఆరాధింపరు; నా మాట నమ్ముము ... యథార్థముగా ఆరాధించువారు ఆత్మతోను సత్యముతోను తండ్రిని ఆరాధించుకాలము వచ్చుచున్నది; అది ఇప్పుడును

వచ్చేయున్నది. తన్ను ఆరాధించువారు అట్టివారే కావలెనని తండ్రి కోరుచున్నాడు" అని ఆయన చెప్పెను. (యోహాను 4:21-23)

## సర్వాంతర్యామి

దేవుడు భౌతిక అవాంతరములను, స్థలములను అధిగమించి ప్రతి స్థలమందును, ప్రతి సమయమందును ఉండువాడైయున్నాడు. సర్వోన్నతుడు హస్తకృతాలయములలో నివసింపడు. "ఆకాశము నా సింహాసనము, భూమి నాపాద పీఠము. మీరు నా కొరకు ఏలాటి మందిరము కట్టుదురు ? నా విశ్రాంతి స్థలమేది ఇవన్నియు నా హస్తకృతములు కావా ? అని ప్రభువు చెప్పుచున్నాడు" (అపొ.కా. 7:47-50).

సొలొమోను మహారాజు యెరూషలేములో దేవాలయమును కట్టించినను, దానిని ప్రతిష్టించు సమయమందు ఇట్లు పలికాడు: "నిశ్చయముగా దేవుడు ఈలోకమందు నివాసము చేయడు; ఆకాశ మహాకాశములు సయితము నిన్ను పట్టజాలవు; నేను కట్టించిన మందిరము ఏలాగు పట్టును? " (I రాజులు 8:27).

"నేను సమీపమున నుండు దేవుడను మాత్రమేనా ? దూరమున నుండు దేవుడను కానా ? యెహోవా సెలవిచ్చిన మాట ఏదనగా - నాకు కనబడకుండ రహస్య స్థలములలో దాగగలవాడెవడైనను కలడా ? నేను భూమ్యాకాశముల యందంతట నున్నవాడను కానా ? యిదే యెహోవా వాక్కు" (యిర్మీయా 23:23-24).

పరిశుద్ధాత్మ ప్రేరణ వలన దావీదు మహారాజు యిట్లు పలికాడు : "యెహోవా నీవు నన్ను పరిశోధించి తెలిసికొనియున్నావు. నేను కూర్చుండుట, నేను లేచుట నీకు తెలియును ... వెనుకను ముందును నీవు నన్ను ఆవరించియున్నావు ... నీ ఆత్మయొద్ద నుండి నేనెక్కడికి పోవుదును ? నీ సన్నిధి నుండి నేనెక్కడికి పారిపోవుదును ? నేను ఆకాశమున కెక్కినను నీవు అక్కడను ఉన్నావు. నేను పాతాళమందు పండుకొనినను నీవు అక్కడను ఉన్నావు. నేను వేకువ రెక్కలు కట్టుకొని సముద్ర దిగంతములలో నివసించినను అక్కడను నీ చేయి నన్ను నడిపించును. నీకుడిచేయి నన్ను

పెట్టుకొనును" (కీర్తన 139 : 1-12).

దేవుడు ఏదో ఒక స్థలమునకే పరిమితియై యుండువాడు కాదని ఇంతవరకు మనం చూచిన లేఖన భాగములు బోధించుచున్నవి. దేవుడు సర్వాంతర్యామి. అంటే ఆయన ఆత్మయైన దేవుడు గనుక అన్నివేళలా, అన్నిచోట్లా అన్ని సమయముల యందు ఉన్నవాడు. అందును బట్టి ఈ విశ్వంలో మనం ఎక్కడ ఉండి ఆయనను ప్రార్ధించినను మన ప్రార్ధనలను ఆయన వినును. మనకు సహాయం చేయును. ఆయన ఎంత గంభీరుడంటే, ఈ విశ్వం అంతా ఆవరించుకొనియున్నాడు. అయినను ఆయన మన హృదయాల్లో నివసింపగల యంతటి చిన్నవాడు. "మహా ఘనుడును, మహోన్నతుడును పరిశుద్ధుడును నిత్యనివాసియునైనవాడు ఈలాగు సెలవిచ్చుచున్నాడు - నేను మహోన్నతమైన పరిశుద్ధ స్థలములలో నివసించువాడను. అయినను వినయము గలవారి ప్రాణమును ఉజ్జీవింపజేయుటకును నలిగినవారి ప్రాణమును ఉజ్జీవింపజేయుటకును వినయము గల వారియొద్దను, దీన మనస్సు గల వారి యొద్దను నివసించుచున్నాను" (యెషయా 57:15). క్రైస్తవులు జీవము గల దేవుని ఆలయమై యున్నారని 2 కొరింధీ 6:16లో వ్రాయబడియున్నది. అందుకే, "మీ దేహము దేవుని వలన మీకు అనుగ్రహింపబడి, మీలోనున్న పరిశుద్ధాత్మకు ఆలయమై యున్నదని మీరెరుగరా ? మీరు మీ సొత్తుకారు. విలువపెట్టి కొనబడినవారు గనుక మీ దేహముతో దేవుని మహిమ పరచుడి'' యని అపొ.పౌలు కొరింధులోని క్రైస్తవులను హెచ్చరించాడు (I కొరింధీ 6:19). దేవుడు సమస్తమును చూచుచున్నాడు, వినుచున్నాడు, మన ప్రార్ధనలకు జవాబిచ్చును అను సంగతులను మనం ఎరుగవలసియున్నది. ఆయన ఆత్మయై యున్నాడు.

## పదార్ధము కాదు

దేవుడు ఆత్మయై యున్నాడనగా - ఆయన పదార్ధము కాదు అని మనం గ్రహించాలి. అంటే ఆయన ఒక వస్తువు కాదు. ఆయన ఆత్మ గనుక "మనుష్యుల చమత్కార కల్పన వలన మల్చబడిన బంగారమునైనను వెండినైనను రాతినైనను దేవత్వము పోలియున్నదని తలంచకూడదు'' (అపొ.కా. 17:29). ఆయన

పదార్ధములతో మల్చబడిన వస్తువు లేక విగ్రహము కాదు గనుక, ఆయన జీవము గల దేవుడు. అందువలన ఆయన తన్నుగూర్చియు, అందరిని గూర్చియు స్మృతి గలవాడు. మానవులకు జంతువులకు వేరుగా పరిపూర్ణ ఆత్మయైన దేవుడు అన్నిసంగతుల ఎరుకగలవాడు. దేవుడు మోషేతో తాను "ఉండుననువాడనై యున్నానని" చెప్పినప్పుడు (నిర్గమ 3:14), ఆయన తనను గూర్చి తానును ఎరిగినవాడనై యున్నాడని చెప్పుకొనెను. ఆయన ఎల్లప్పుడు ఉండువాడు. మన పరిజ్ఞానము పరిమితి గలది. Our Perception is limited. దేవుడైతే సమస్తమును సంపూర్ణముగా ఎరిగిన వాడు. మన విజ్ఞాపనలను వినగలవాడు, మనకు సాటియైన సహాయము చేయగలవాడు, అందువలన మనం ఆయనకు విజ్ఞాపనచేయాలని ఆయన కోరుచున్నాడు. అట్టివాడే పరిపూర్ణ ఆత్మ, ఆయనే దేవుడు.

## సర్వజ్ఞాని

ఆత్మకు స్వశక్తి, స్వయం నిర్ణయాధికారము, స్వీయ గమ్యము ఉంటాయి. భౌతిక విశ్వానికి, నిర్ణయించే శక్తి లేదు. అది స్వయంగా చలించుట లేదు, అలాగ చలించేశక్తి విశ్వానికి లేదు. దాని గమనా గమనములకు దానినుండి వేరైన శక్తిపై ఆధారపడియున్నది. అయితే దేవుడు అట్లుకాదు. ఆయన ఎప్పుడైనా, ఎక్కడైనా తనకిచ్ఛ వచ్చినట్లు చేయగలడు. ఈ లోకం ఎప్పుడు ఆరంభమయ్యిందో, ఎప్పుడు అంతం కాబోవు చున్నదో ఆయన ఒక్కడే ఎరుగును. ఈ లోక క్రియలన్నిటినీ ఆయన ఎరుగును. అన్నీ ఆయన ఆధీనములో యున్నాయి. అవుసరాన్ని బట్టి దేవుడు తన క్రియలను మార్చును. ఒకడు పాపము చేయగా ఆయన వానిని శిక్షించును గాని అతడు మారు మనస్సు పొందినప్పుడు ఆయన క్షమించును.

దేవుడు ఈ లోకమును చేసినప్పుడు ఒక ప్రత్యేక ప్రయోజనము కొరకు దాన్ని సృజించాడు. ప్రస్తుతం జరుగుచున్న సంగతులను ఆయన తన దయా సంకల్పము చొప్పున సంకల్పించినట్లు ఎఫెసీ 1:9 చెప్పుచున్నది, "ఆయన తన చిత్తానుసారముగా చేసిన నిర్ణయము చొప్పున సమస్త కార్యములను జరిగించుచున్నాడు" (ఎఫెసీ 1:12). ఇవన్నియును ఆయన క్రీస్తు యేసునందు చేసిన నిత్య సంకల్పము చొప్పున

జరిగించుచున్నాడు (ఎఫెసీ 3:11). దేవుడు నిశ్చయించాడు, నిర్ణయించాడు, సంకల్పించాడు అంటే ఆయన సర్వజ్ఞానియైన ఆత్మయైయున్నాడని గ్రాహ్యమగుచున్నది.

## ఆత్మతో ఆరాధించాలి

దేవుడు ఆత్మ గనుక ఆయనను ఆరాధించువారు ఆత్మతోను సత్యముతోను ఆరాధించవలెనని యేసుప్రభువు చెప్పారు. అంటే ఆత్మయైన దేవుని మానవుడు ఆత్మతో ఆరాధించునపుడు దైవమానవాత్మల కలయిక సంభవిస్తాది. మానవుడు ఆత్మతో ఆరాధించునపుడే దైవానికి మానవునికి సహవాసం యేర్పడతాది. ఆరాధనలో మానవుని ఆత్మ దేవుని ఆత్మను కొనియాడుచు ఉచ్ఛస్థితికి చేరుకొంటాది. మానవుని ఆత్మకు సంతృప్తి లభిస్తాది. ఆత్మయైన దేవుని ఆరాధించుటలోనే మానవుడు నిజమైన సహవాసమును సమాధానమును దేవుని నుండి పొందగలడు. విశ్వంలో యున్న ఏ వస్తువును, లేక పదార్థమును ఆరాధించుట వలన మానవునికి సంతృప్తి, సంతోషము, సమాధానము లభించదు. ఏలయనగా ఆత్మను గాక వస్తువులను ఆరాధించుటలో దైవ మానవాత్మల కలయిక సంభవించదు. భౌతిక రూపములు లేక వస్తువులు మానవుడు చేయు ఆరాధనను గూర్చిన ఎరుక కలిగియుండవు. వినలేని, చూడలేని, తాకలేని, జవాబీయలేని నిర్జీవ రూపములకు మానవుడెందుకు ప్రార్థించాలి ? అర్పణలు అర్పించాలి ? అయినను నేడు కోట్లకొలది ప్రజలు అట్లే చేయుచున్నారు. వారు సత్యము నెరుగరు. " నిశ్చయముగా కొండల మీద జరిగినది మోసకరము, పర్వతముల మీద చేసిన ఘోష నిష్ప్రయోజనము. నిశ్చయముగా మా దేవుడైన యెహోవా వలన ఇశ్రాయేలు నకు రక్షణ కలుగునని" అందుకే ప్రవక్తయైన యిర్మియా చెప్పాడు (యిర్మియా 3:23).

దేవుడు ఆత్మయై యున్నాడు. ఆయనను మానవుడు ఆత్మతో ఆరాధించునపుడు దైవమానవాత్మల కలయిక సంభవించును. మానవుడు తన కంటే ఉన్నతుడైన వానివి ఆదర్శమూర్తిగా ఎంచి ఆరాధించును. ఆయనను ఆరాధించుకొలది ఆ ఆదర్శమూర్తి యొక్క లక్షణములను కొనియాడుచు వాటిని అనుకరించును.

మానవుడు అనుకరింపదగు ఉన్నత ఆదర్శములు ఆత్మయైన దేవునిలోనే కనపడును. అవి జంతువులలో గాని, వృక్షములలో గాని, రాళ్లు రప్పలలో గాని, వెండి బంగారములలో గాని వానికి లభించవు.

దేవుడు ప్రేమయైయున్నాడు. ఆయన కృపా కనికరములు గలవాడు. దయాదాక్షిణ్య పూర్ణుడు. మానవుడు కూడ ఆత్మ కలిగిన జీవియే. అతడు ఆదిలో దేవుని ఆత్మీయ స్వరూపమందు, ఆయన పోలిక చొప్పున చేయబడినవాడు. ఆత్మయైన దేవుని ఆరాధిస్తూ మానవుడు ప్రేమించగలడు, కృపా కనికరములు, దయా దాక్షిణ్యములు గల వ్యక్తిగా తయారవుతాడు. ఆత్మయైన దేవుని కొనియాడతాడు.

* * *

# మీ దేవుని గూర్చి మాకు చెప్పండి
## (Tell us about your God)

ఏథెన్సు ప్రజల ఆహ్వానము మేరకు అపొస్తలుడైన పౌలు అరెయొపగు మధ్యను నిలిచి వారికి సజీవుడైన దేవుని గూర్చి తెలియజెప్పెను. ఏథెన్సు పురప్రజలు విగ్రహముల నారాధించెడివారు (అపో.కా. 17:16-34). వారి ఆరాధనామూర్తులు కంటికి కనబడేవే. అయితే అదృశ్యుడగు నిజదేవుని వారికి పరిచయం చేయు బాధ్యతను పౌలు వహించాడు. నీవైతే వారికి యేమి చెప్పియుందువు ? పౌలు వారికి దిగువ సంగతులను బోధించాడు :

**నిజదేవుడు అనేకులకు తెలియబడనివాడు :** "నేను సంచరించుచు మీ దేవతా ప్రతిమలను చూచుచుండగా ఒక బలిపీఠము నాకు కనబడెను. దానిమీద - తెలియబడని దేవునికి అని వ్రాయబడియున్నది. కాబట్టి మీరు తెలియక దేనియందు

భక్తి కలిగియున్నారో దానినే నేను మీకు ప్రచుర పరచుచున్నాను" అని అతడు చెప్పెను (అపొ.కా. 17:23). కొందరు మానవ కల్పితములైన వస్తువులను, ప్రతిమలను జంతువులను, జంతువుల స్వరూపములను ఆరాధిస్తారు. మరికొందరు నిజదేవుని ఆరాధిస్తారు గాని ఆయన చెప్పినరీతిగా ఆరాధించరు. మన ఆరాధనను ఆయన అంగీకరించాలంటే ఆయననుండి కలిగిన జ్ఞానమును బట్టి ఆయనను ఎరిగి ఆరాధించాలి.

**నిజదేవుడు జగత్తును అందలి సమస్తమును సృజించిన సృష్టి కర్త (అపొ.కా. 17:24) :** మానవ నిర్మితములైన కంప్యూటర్లు, జనరేటర్లు, కెమెరాలు, గడియారాలు వగయిరాల వలన మనం ఆశ్చర్యపోతుంటే పక్షులు, ప్రకృతి, నేత్రములు, మెదడును సృజించిన దేవుని జ్ఞానమును బట్టి మరింత ఆశ్చర్యపోవాలి. దేవుని నిత్యశక్తి, జ్ఞానము, ఆయన సృజించిన వస్తువులను ఆలోచించుట వలన మనకు తేటగా కనబడును (రోమా 1:20-23).

**నిజదేవుడు ఆకాశమునకు, భూమికి ప్రభువై యున్నాడు (అపొ.కా. 17:24) :** క్రీస్తు ద్వారా సమస్తమును ఆయన పాలించుచున్నాడు (I కొరింథీ 15:27). క్రీస్తును దేవుని కుమారునిగా ఎవరు ఒప్పుకొందురో, ఎవరు ఆయన ప్రభుత్వానికి లోబడుదురో వారే రక్షింపబడుదురు (యోహాను 14:6; అపొ.కా. 4:12; హెబ్రీ 5:10).

**నిజదేవుడు ఆత్మయైయున్నాడు గనుక హస్తకృతములైన ఆలయములలో నివసింపడు (అపొ.కా. 17:24) :** యోహాను 4:24ను కూడ చూడండి. ఏథెన్సులోని అందమైన ఆలయములు ఆయనకు సరిపోవు. దేవుడు గుడులలో కాదు గాని తన సంఘములో వసించును (I కొరింథీ 3:16); ప్రతి క్రైస్తవునిలో వసించును (I కొరింథీ 6:19; రోమా 8:9).

**నిజదేవుడు స్వతంత్రుడు :** "తనకు ఏదైనా కొదువయున్నట్టు మనుష్యుల చేతులతో సేవింపబడువాడు కాడు" (అపొ.కా. 17:25). విగ్రహాలను శుభ్రం చేయడానికి, పాలిష్ చేయడానికి, రంగులు పూయించడానికి, దొంగల

బారినపడకుండుటకు వాటికి సహాయం అవుసరము. సజీవుడైన నిజదేవునికిట్టి సహాయం అవుసరం లేదు. మనం ఆయన సహాయంపై ఆధారపడియున్నాము. "మనమాయన యందు బ్రదుకుచున్నాము, చలించుచున్నాము, ఉనికిని కలిగియున్నాము" (అపొ.కా. 17:28).

నిజదేవుడు "మనలో ఎవనికిని దూరముగా యుండువాడు కాడు" : మరియు మనమాయనను వెదకి కనుగొనాలని కాంక్షించుచున్నాడు (అపొ.కా.17:27). ఆయన చేతిపనిని మన చుట్టూ చూడగలము, బైబిలును చదువుట ద్వారా ఆయన మాటలను వినగలము, ప్రార్ధన ద్వారా ఆయనతో ఎక్కడనుండియైనా మాట్లాడగలము. తనకు నమ్మకముగా యున్నవారిని ఆయన ఎన్నడు విడువడు, ఎడబాయడు (1 పేతు 3:10-12; హెబ్రీ (3:5).

నిజదేవుడు నీతిమంతుడు : ఆయన "తాను నియమించిన మనుష్యుని ద్వారా భూలోకమునకు తీర్పు తీర్చబోయెడి యొక దినమును నిర్ణయించియున్నాడు" (అపొ.కా. 17:31). ఆ తీర్పరి యేసుక్రీస్తే. ఆయన మృతులలో నుండి తిరిగి లేచిన దేవుని కుమారుడు (యోహాను 5:26-27; 2 కొరింధీ 5:10). అవినీతితో దేవుడు సహవాసము కలిగియుండలేడు. మనం వయసులో పెరిగేకొలది మంచిచెడులను గుర్తించగలము. అయినను ఒక్కోసారి చెడుగునే ఎంచుకొంటాము (రోమా 3:23). అయితే దేవుడు ప్రేమగలవాడు, కరుణామయుడు. మన రక్షణకొరకు ఒకమార్గము నేర్పరచాడు. అందరు అంతట మారుమనస్సు పొందాలని ఆయన ఆజ్ఞాపించుచున్నాడు (అపొ.కా. 17:30), పాపము నుండి వైదొలగి దేవునికి లోబడుటకు నిశ్చయించుకొనుటయే మారుమనస్సు. పాపియైనవాడు నీటిలో బాప్తిస్మము పొందినప్పుడు, అతడు క్రీస్తు మరణములోనికి బాప్తిస్మము పొందును. అక్కడ ఆయన మనపాపపు అపరాధములను కడిగివేయును. ఈ రీతిగా దేవుడు మనలను నీతిమంతులుగా చేయును, తాను నీతిమంతునిగా యుండును (రోమా 3:26). సజీవుడైన నిజదేవుడు గొప్పవాడు ! !

- రాయిస్ ఫ్రెడరిక్ (IGT)

# యేసుక్రీస్తు ఎవరు ?
# (Who is Jesus Christ ?)

యేసుక్రీస్తు పేరును విననివారు ఈలోకంలో బహు తక్కువమంది యుంటారు. గాని ఆయన పేరును విన్నవారిలో చాలమంది ఆయన నిజంగా ఎవరో ఎరుగక సందిగ్ధావస్థలో యున్నారు. కోట్లకొలది ప్రజలు ఆయన యందు విశ్వాసముంచుచున్నారు. గాని ఆయన యందు విశ్వాసముంచని వారు కూడ కోట్ల కొలది యున్నారు. అయితే యేసుక్రీస్తు ఎవరు ?

యేసుక్రీస్తు ఆదినుండియు దేవునితో ఉండెను. ఆయన దేవుని మహిమ యొక్క తేజస్సును ఆయన తత్వము యొక్క మూర్తిమంతమునై యున్నాడని హెబ్రీ 1:3 చెప్పుచున్నది. యోహాను 1:1లో ఆయన వాక్యమని పిలువబడెను. ఆదియందు వాక్యముండెను, ఆ వాక్యము దేవుని యొద్ద ఉండెను; ఆ వాక్యము దేవుడై యుండెను. అంటే దైవత్వములో ఆయన ఒకవ్యక్తియై యుండెను. ఆయన తండ్రియైన దేవునితోను, పరిశుద్ధాత్మయైన దేవునితోను వుండెను. దేవుడు నిత్యుడు, ఆయన ఆద్యంతములు లేనివాడు. యేసుక్రీస్తు కూడా అట్లే (యెషయా 63:16). ఆయన నిన్న నేడు నిరంతరము ఒకేరీతిగా యుండువాడు (హెబ్రీ 13:8). ఆయన దేవుని సృష్టికి ఆదియునైనవాడు (ప్రక 3:14). మరియు మొదటివాడును, కడపటివాడును ఆయనే (ప్రక 22:13).

యేసుక్రీస్తు సమస్తానికి సృష్టి కర్త. "ఆది యందు దేవుడు భూమ్యాకాశములను సృజించెను" అని ఆదికాండము 1:1లో వ్రాయబడియున్నది. ఆదిమ హెబ్రీ భాషలో దేవుడు అనుపదము బహువచనమును సూచించును గనుక దానిలో తండ్రి, కుమార, పరిశుద్ధాత్మలు ఇమిడియున్నారు. ఆదికాండము 1:26లో దేవుడు "మన స్వరూపమందు మన పోలిక చొప్పున నరులను చేయుదము" అని పలికెను. కొలస్స 1:16, 17లో పౌలు యేసును గూర్చి చెబుతు, "సర్వమును ఆయన యందు సృజింపబడెను,

సర్వమును ఆయన ద్వారాను ఆయనను బట్టియు సృజింపబడెను" అని చెప్పెను.

యేసుక్రీస్తుకు భూసంబంధమైన తండ్రి ఎవరు లేడు. ఆయన దేవుని శక్తి వలన కన్యయైన మరియకు జన్మించెను. ఆయన ఇట్టి ఏకైక జననమును గూర్చి ప్రవక్తయైన యెషయా కొన్ని వందల సంవత్సరములకు పూర్వమే ప్రవచించెను : "ఆలకించుడి; కన్యక గర్భవతియై కుమారుని కని అతనికి ఇమ్మానుయేలను పేరుపెట్టును" (యెషయా 7:14). "ఆమె యొక కుమారుని కనును; తన ప్రజలను వారి పాపముల నుండి ఆయనే రక్షించును గనుక ఆయనకు యేసు అనుపేరు పెట్టుదువనెను" (మత్తయి 1:21). ఈ వచనములను బట్టి యేసుక్రీస్తు అద్భుతరీతిగా జన్మించెననియు ఆయన మానవమాత్రుడు కాదనియు గ్రహించుకోగలము.

యేసుక్రీస్తు దేవుని కుమారుడు. ఆయన తన దైవత్వాన్ని దైవసమానత్వాన్ని, శక్తిని విసర్జించి మానవునిగా అవతరించి, భౌతిక జననము ద్వారా మానవులకు సోదరుడై దేవునికి లోబడి యుండెను (ఫిలిప్పీ 2:3-8). మానవులను తమ పాపముల నుండి విమోచించుటకు ఆయన లోకమునకు వచ్చెను. "దేవుడు లోకమును ఎంతో ప్రేమించెను. కాగా ఆయన తన అద్వితీయ కుమారునిగా పుట్టిన వానియందు విశ్వాసముంచు ప్రతివాడును నశింపక నిత్యజీవము పొందునట్లు ఆయనను అనుగ్రహించెను; లోకము తన కుమారుని ద్వారా రక్షణ పొందుటకే గాని, లోకమునకు తీర్పు తీర్చుటకు దేవుడాయనను లోకములోనికి పంపలేదు" (యోహాను 3:16-17). "నశించిన దానిని వెదకి రక్షించుటకు మనుష్య కుమారుడు వచ్చెను" అని క్రీస్తు వారే తనను గూర్చి చెప్పుకొనెను (లూకా 19:10).

తాను దేవుని కుమారుడనని నిరూపించుటకొరకు యేసుక్రీస్తు అద్భుతములు చేసెను. "మరియు అనేకమైన యితర సూచక క్రియలను యేసు తన శిష్యుల యెదుట చేసెను; అవి యీ గ్రంథమందు వ్రాయబడి యుండలేదు గాని యేసుదేవుని కుమారుడైన క్రీస్తు అని మీరు నమ్మునట్లును, నమ్మి ఆయన నామమందు జీవము పొందునట్లును యివి వ్రాయబడెను" (యోహాను 20:30, 31).

ఆయన యందు విశ్వాసముంచు వారందరు రక్షింపబడి నిత్యజీవ నిరీక్షణ కలిగి యుండునట్లు యేసుక్రీస్తు సిలువపై మరణించెను. అపో.పౌలు యిట్లు వ్రాసెను. "మరియు సహోదరులారా, నేను ప్రకటించిన సువార్తను మీకు తెలియపరచుచున్నాను; మీరు దానిని అంగీకరించితిరి, దానియందే నిలిచియున్నారు. మీ విశ్వాసము వ్యర్థమైతేనే గాని, నేను ఏ ఉపదేశ రూపముగా సువార్త మీకు ప్రకటించితినో, ఆ ఉపదేశమును మీరు గట్టిగా పట్టుకొనియున్న యెడల ఆ సువార్త వలననే మీరు రక్షణ పొందు వారైయుందురు. అదేమనగా లేఖనముల ప్రకారము క్రీస్తు మృతిబొందెను, సమాధి చేయబడెను. లేఖనముల ప్రకారము మూడవ దినమున లేపబడెను" (I కొరింథీ 15:1-4).

ఆయనకు విధేయులైన వారిని తన కుటుంబముగా ఎంచి రక్షించుటకు యేసుక్రీస్తు వాగ్దానము చేసెను. వారిని ఆయన "నా సంఘము" అని పిలిచెను (మత్తయి 16:18). ఆయన వారి కొరకు చనిపోయెను. ఆయన రక్తము ద్వారా తమ పాపముల నుండి కడుగబడినవారందరినీ ఆయన తన సంఘమందు చేర్చుకొనును. ఆ సంఘము ఆయన శరీర మనబడినది, దానికి ఆయనే శిరస్సు. ఆ సంఘము ఆయన వధువు అని కూడ పిలువబడినది. అది ఆయన పేరు ధరించును (ఎఫెసీ 5:23, 25; అపో.కా. 2:47; ఎఫెసీ 3:15; అపో.కా. 4:12).

యేసుక్రీస్తు దేవునిలో యున్న రెండో వ్యక్తి. (తండ్రి, కుమార, పరిశుద్ధాత్మలు ముగ్గురు ఏకమై ఒకేదేవుడైయున్నారు). (మత్తయి 28:19, 20). దేవుడొక్కడే, ప్రభువును ఒక్కడే మరియు ఆత్మయు ఒక్కడే (ఎఫెసీ 4:1-6). ఇహపరముల యందు క్రీస్తుకు సర్వాధికారమున్నది (మత్తయి 28:18). ఆయన ఇప్పుడు తండ్రి కుడి పార్శ్వమున ఆశీనుడై యున్నారు. ప్రభువులకు ప్రభువుగాను, రాజులకు రాజుగాను ఆయన ఇప్పుడు పాలించుచున్నారు. (I తిమో 6:15). ఒకానొక దినమందు ఆయన మరల రాబోవుచున్నారు. అప్పుడు తనవారైన సంఘమును పరలోకమునకు కొనిపోవును. వారాయనతో నిత్యము నివసింతురు. ఆయన యిట్లు వాగ్దానము చేసారు : " మీ హృదయములను కలవరపడనియ్యకుడి, దేవుని యందు

విశ్వాసముంచు చున్నారు, నా యందును విశ్వాసముంచుడి. నా తండ్రి యింట అనేక నివాసములు కలవు, లేనియెడల మీతో చెప్పుదును; మీకు స్థలము సిద్ధపరచవెళ్లుచున్నాను. నేను వెళ్లి మీకు స్థలము సిద్ధపరచినయెడల, నేనుండు స్థలములో మీరును ఉండులాగున మరల వచ్చి నా యొద్దనుండుటకు మిమ్మును తీసికొనిపోవుదును" (యోహాను 14:1-3).

నీవు క్రీస్తు నందు విశ్వాసముంచుచున్నావా ? "నేను ఆయననని మీరు విశ్వసింపని యెడల మీరు మీ పాపములలోనే మరణింతురని" ఆయన హెచ్చరిక చేసియున్నారు (యోహాను 8:24). ఆయన యందు విశ్వాసివియైతే ఆయనకు లోబడి (మార్కు 16:16). మరణ పర్యంతము నమ్మకముగా యుండుము. నిత్యజీవ కిరీటము నీదగును (ప్రక 2:10).

- జి.పి.థోట్

# పనికి వెళ్దాం, పద !
## (Let's get to work !

చురుకుగా యుండడం అతని వల్లకాదు, కోరిక కూడా కాదు
అందరు యేం చేసినా అతడు మాత్రం మంట దగ్గరే యుండేవాడు

దినదినం అదే అలవాటు, దాన్ని గూర్చి అతనికి విసుకు లేదు
అందరు సంఘాభివృద్ధికొరకు కృషి చేస్తుంటే, మంట దగ్గరే అతని మకాం

అందరిలాగే అతడు చనిపోయినప్పుడు, అతడు పైకి పోయాడన్నారు;
అయితే ఏంచేస్తూయుండేవాడో దాన్నే చేస్తూయుంటే,
అతడు మంటలోనే ఇప్పుడుంటాడు !

పై మాటలు క్రైస్తవులలో ఎంతమందికి వర్తిస్తాయో కదా ? చేయవలసిన పని ఎంతో యున్నది. అయితే దేవుని వాగ్దానాలపై నిలబడవలసిన ప్రజలు, చతికిల

బడియున్నారు. మనందరం పనికి వెళ్లాల్సిన కారణాలను కొన్ని మీకు చూపించగోర్తాను. క్రైస్తవులు ప్రభువు కార్యాభివృద్ధి యందు ఎప్పటికిని ఆసక్తులై యుండాలి (I కొరింధీ 15:58). క్రియలు లేని విశ్వాసము మృతము (యాకోబు 2:24).

మొదటిగా, దేవుని సంతోషపరచు నిమిత్తం మనం దేవుని పనిచేయాలి. "ఆయన కిష్టమైన కార్యము నేనెల్లప్పుడును చేయుదునవి" యేసు చెప్పెను (యోహాను 8:29). దేవుని పనియందు ఆసక్తికలవాడై యేసుప్రభువు తండ్రియైన దేవుని సంతోషపరచెను. మనం కూడ అట్లే చేయాలి. మనము దేవుని సంతోషపరచువిధంగా నడుచుకొనాలని పౌలు చెప్పాడు (I థెస్స 4:1). "మరియు మనమాయన ఆజ్ఞలను గైకొనుచు ఆయన దృష్టికి ఇష్టమైనవి చేయుచున్నాము గనుక, మనమేమి అడిగినను అది ఆయన వలన మనకు దొరకును" అని యోహాను చెప్పాడు (I యోహాను 3:22). మనం అశ్రద్ధగా యుండి దేవుని సంతోషపరచలేం. రాత్రి వచ్చుచున్నది గనుక మనం పనిచేయాలి. ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం దేవుని కొరకు పనిచేయాలి.

రెండవదిగా, దేవుని పనిలో నిమగ్నులై యుండుట మనకు మంచిది గనుక మనం పనిచేయాలి. "కాబట్టి మేలైనది చేయనెరిగియు ఆలాగు చేయని వానికి పాపము కలుగును" అని యాకోబు చెప్పాడు (యాకోబు 4:17). యేసుప్రభువు మేలు చేయుచు సంచరించుచుండెను (అపో.కా.10:38). మనం అంతకంటే తక్కువ చేయగలమా ? కానేకాదు. క్రైస్తవులు ప్రతి సత్కార్యము చేయుటకు సిద్ధపడియుండాలి (తీతు 3:1). సత్క్రియలు చేయుటకై క్రీస్తు యేసునందు మనము సృష్టింపబడినవారము (ఎఫెసీ 2:10). మనము అందరికి, విశేషముగ విశ్వాస గృహమునకు చేరినవారికి మేలు చేయవలెను (గలతీ 6:10). మనుష్యులు మన సత్క్రియలను చూచినప్పుడు పరలోక మందున్న తండ్రిని మహిమ పరచుదురు (మత్తయి 5:16). క్రైస్తవ్యము వ్యాప్తి జెందాలంటే క్రైస్తవులు సత్క్రియల యందాసక్తిగలవారై యుండాలి. అది క్రైస్తవునికి మంచిది. సత్క్రియల ఫలితము ననుభవించువారికి మంచిది.

మూడవదిగా దేవుని యెడల మనకున్న ప్రేమను చూపుటకు మనం దేవుని పనిచేయాలి. "మీరు నన్ను ప్రేమించిన యెడల, నా ఆజ్ఞలను గైకొందురు" అని

యేసు చెప్పెను (యోహాను 14:15). "మనమాయన ఆజ్ఞలను గైకొనుటయే దేవుని ప్రేమించుట; ఆయన ఆజ్ఞలు భారమైనవి కావు" (I యోహాను 5:3). మన ప్రేమ పెదవుల మట్టుకే కాదు గాని దాన్ని క్రియారూపకముగా దేవుడు చూడగోరును.

నాల్గవదిగా, పనిచేయడం దేవుని లక్షణం గనుక మనమును పనిచేయాలి. మానవుని పాపమునుండి రక్షించుటకు గాను దేవుడు పనిచేసాడు. "దేవుడు లోకము నెంతో ప్రేమించెను; కాగా ఆయన తన అద్వితీయ కుమారుని యందు విశ్వాసముంచు ప్రతివాడును నశింపక నిత్యజీవము పొందునట్లు ఆయనను అనుగ్రహించెను" (యోహాను 3:16). "ఎట్లనగా, మనమింకను పాపులమై యుండగానే, క్రీస్తు మనకొరకు చనిపోయెను" (రోమా 5:8).

మన విమోచనార్థం పరిశుద్ధాత్ముడు పనిచేయుచున్నాడు. వధువైన సంఘముతో కలిసి అందరును జీవజలమును ఉచితముగా పొందవచ్చునని ఆహ్వానించుచున్నాడు (ప్రక 22:17).

నశించిన వారిని వెదకి రక్షించుటకు క్రీస్తు వచ్చెను (లూకా 19:10). ఆయన పరిచారము చేయించుకొనుటకు రాలేదు గాని పరిచారము చేయుటకును అనేకులకు ప్రతిగా విమోచన క్రయధనముగా తన ప్రాణము నిచ్చుటకును వచ్చెను (మత్తయి 20:28). చేయుటకు తండ్రియైన దేవుడు అప్పగించిన దానిని క్రీస్తు పూర్తిగా నెరవేర్చెను (యోహాను 17:4; 19:30).

అయిదవదిగా, యితరులకు సహాయం చేయునిమిత్తం మనం పనిచేయాలి. "అందరును పాపము చేసి దేవుడనుగ్రహించు మహిమను పొందలేకపోవుచున్నారు" (రోమా 3:23). "పాపము వలన వచ్చు జీతము మరణము" (రోమా 6:26). రక్షించుటకు సువార్త దేవుని శక్తియై యున్నది (రోమా 1:16). మనం సువార్త ప్రకటించే పనిలో యున్నప్పుడు యితరులకు సహాయం చేయుదుము. "మీరు సర్వలోకమునకు వెళ్లి సర్వసృష్టికి సువార్తను ప్రకటించుడి; నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడును; నమ్మనివానికి శిక్ష విధించబడును" (మార్కు 16:15-16). దీనినే

మనం గొప్ప ఆజ్ఞయని పిలుతుము. నశించిన వారి ఆత్మల రక్షణార్ధము మనం పనిచేయాలని క్రీస్తు కోరుచున్నారు.

తప్పిదములో యున్నవారికి సహాయం చేయుటకు మనం పనిచేయాలి. కృపలో నుండి పడిపోయిన వారిని గూర్చి నేను చెప్పుచున్నాను. సహోదరుడెవడైనను ఏ తప్పిదము లోనైనను చిక్కుకొనిన యెడల ఆత్మ సంబంధులైన వారు అట్టివానిని మంచి దారికి తీసికొనిరావలెను (గలతీ 6:1). సహోదరులు సత్యము నుండి తప్పిపోగలరు. అట్టివారిని సత్యమునకు మళ్లించిన యెడల వారి ఆత్మలను మరణము నుండి రక్షించి అనేక పాపములను కప్పుట జరుగును (యాకోబు 5:19-20). మనకు సమయము, తరుణము ఉండగానే తప్పిపోయిన సహోదరులను మంచి దారికి మళ్లించ బాధ్యులము.

పాపములో యున్నవారికి సువార్త బోధించుట ద్వారా మన ఆత్మయే రక్షించ బడును. తప్పిదములో పడిన వారిని మంచిదారికి మళ్లించుట వలన మనం తప్పిపోకుండ జాగ్రత్త పడుదుము. ఆత్మల రక్షణలో నిమగ్నులైయున్నవారు తమ ఆత్మ రక్షణను నిర్లక్ష్యము చేయుటకు సమయముండదు. "భయముతోను వణకుతోను మీ సొంత రక్షణను కొనసాగించుకొనుడి" యని పౌలు చెప్పెను (ఫిలిప్పీ 2:12). మన స్వంత రక్షణను కొనసాగించుకొనుటలో యితరులను రక్షించే పనికూడ యిమిడి యున్నది.

ఆరవదిగా, మరణం వచ్చుచున్నది గనుక మనం పనిచేయాలి. "మనుష్యు లొక్కసారే మృతినొందవలెనని నిర్ణయించబడెను" (హెబ్రీ 9:27). "చేయుటకు నీ చేతికి వచ్చిన యేపనినైనను నీశక్తిలోపము లేకుండ చేయుము; నీవు పోవు పాతాళము నందు పనియైనను ఉపాయమైనను తెలివియైనను జ్ఞానమైనను లేదు" అని సొలొమోను పలికెను (ప్రసంగి 9:10). మరణించిన తరువాత మనం దేవుని పని చేయలేం. మనం జీవించియుండగానే మన తరుణాలను, సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలి. యేసు చెప్పినట్లు, పగలున్నంతవరకు మనము పనిచేయాలి. రాత్రి వచ్చుచున్నది, అప్పుడెవ డును పనిచేయలేడు (యోహాను 9:4).

ఏడవదిగా, అపవాది పనిచేయుచున్నాడు గాన మనము పనిచేయాలి. అపవాది పనిచేయుచున్నాడని నీవు నమ్మకపోతే ఒకసారి నీ చుట్టూయున్న లోకాన్ని చూడు. సాతానుడు రోజుకు 24 గంటలు పనిచేయుచున్నాడు. అతడెన్నడు నిద్రపోడు. ఒక్కరోజు కూడా శెలవు తీసికోడు. ఎవని మ్రింగుదునా యని గర్జించు సింహమువలె తిరుగుచున్నాడు (I పేతురు 5:8). దేవుని యెదుట సహోదరుల మీద రాత్రింబగళ్లు అతడు నేరము మోపుచు యుంటాడు (ప్రకటన 12:10). అపవాది కంటె తక్కువ పనిచేయకుండుట దేవుని పరిశుద్ధులకు శ్రేయస్కరము కాదు.

అయ్యా రోజుకు 24 గంటలు మేమేలాగు పనిచేయగలం ? అని మీరడుగ వచ్చును. గత 24 సంవత్సరముల నుండి నేను సువార్త సంబంధమైన పుస్తకములు వ్రాయుచున్నాను. ముద్రించబడిన ప్రతులు ఎన్నడు నిద్రించవు. అవి రాత్రింబగళ్లు పనిచేయును. ముద్రించబడిన సత్యము ఎన్నడు మారదు. లేఖకుడు ఈ లోకాన్ని విడిచివెళ్లినను అతని గ్రంథములు పనిచేయుచునే యుండును. కంప్యూటర్ ద్వారా, ఇంటర్నెట్ ద్వారా, ఉపగ్రహముల ద్వారా సువార్తను లోకానికంతటికీ చాటించే తరుణం ఇప్పుడు మనం కలిగియున్నాము.

పాపములో చిక్కుకొన్నవారి కొరకు 24 గంటలు ప్రార్థన చేసే సంఘాలున్నాయి. వారు ప్రజల అవుసరతల కొరకు ప్రార్థించుచున్నారు. శ్రమలలో యున్నవారి కొరకు, బాధింపబడు వారికొరకు ప్రార్థించుచున్నారు. దేవుని చిత్తానుసారముగా లేనిది తప్ప ప్రార్థనకు శక్యముకానిది యేదీ లేదు. ప్రార్థన శక్తిని మనం ఇంకా గ్రహించుకోలేదు. అందుకే యేసు "మనుష్యులు విసుగక నిత్యము ప్రార్థించవలెనని" చెప్పెను. (లూకా 18:1). మనం సరిగ్గా సమర్పించుకొంటే, పరిశుద్ధులు రోజంతా పనిచేసేటట్లు ప్రయత్నిస్తాం.

మనం దేవుని పనిచేయకపోతే యేమి జరుగుద్దో ఆలోచించండి. ఆత్మలు నశిస్తాయ్. బీదలు నిర్లక్ష్యం చేయబడ్తారు (గలతీ 2:10). వారి ఆకలి తీర్చబడదు. వస్త్ర హీనులవుతారు. రోగులు, క్రొత్తవారు, చెరసాలలలోయున్నవారు పరిచర్య

చేయువారులేక బాధపడ్డారు. సంఘము మృతిజెందుతాది. దేవుడు మహిమ పర_బడడు (యోహాను 15:8).

ఎనిమిదవదిగా, తీర్పు రానున్నది గనుక మనం దేవుని పనిచేయాలి. "ఎందుకనగా, తాను జరిగించిన క్రియల చొప్పున అవి మంచివైనను సరే చెడ్డవైనను సరే, దేహముతో జరిగించిన వాటి ఫలమును ప్రతివాడు పొందునట్లు మనందరమును క్రీస్తు న్యాయపీఠము ఎదుట ప్రత్యక్షము కావలయునని" అపొ.పౌలు చెప్పెను (2 కొరింధీ 5:10). ప్రతివాడు వాని వాని క్రియల చొప్పున తీర్పుపొందును (రోమా 2:6). "ఇదిగో నేను త్వరగా వచ్చుచున్నాను. వాని వాని క్రియచొప్పున ప్రతివానికిచ్చుటకు నేను సిద్ధపరచిన జీతము నాయొద్ద ఉన్నది" యని యేసు చెప్పెను (ప్రకటన 22:12). దేవుని కొరకు, క్రీస్తు కొరకు పనిచేసిన వారిని చూచి క్రీస్తు, "నా తండ్రి చేత ఆశీర్వదించబడినవారలారా, రండి; లోకము పుట్టినది మొదలుకొని మీ కొరకు సిద్ధపరచబడిన రాజ్యమును స్వతంత్రించుకొనుడి" యని చెప్పును (మత్తయి 25:34).

గనుక నీ వేమంటావ్ ? దేవుని పనికి వెల్దాం, పద ! !

- జాన్ స్టేసీ

# క్రీస్తు మరల వచ్చునప్పుడు -2
## (When Christ comes again)

యేసుక్రీస్తు రెండవసారి రాబోవుచున్నాడని బైబిలు బోధించు సత్యములను కొన్నింటిని గత పాఠములో మనము తెలిసికొనియున్నాము. ఆయన రెండవ రాకడకు ముందు జరుగవలసి యున్న సంగతులన్నియు నెరవేరియున్నవని అందువలన ఆయన ఏక్షణమందైనా ప్రత్యక్షము కాగలడని మనము నేర్చుకొని యుంటిమి. అంతేకాదు ఆ ఘడియ ఎప్పుడో మనమెవరము ఎరుగము గనుక మనము ఎల్లప్పుడు

సిద్ధపడియుండవలెనని కూడ మనము గ్రహించి యుంటిమి. క్రీస్తు యొక్క రెండవ రాకడను గూర్చిన సత్యములను మరికొన్నింటిని దైవవేదమునుండి ఈరోజు పరిశీలించెదము.

## ఏ రీతిగా వచ్చును ?

ఆయన రెండవసారి వచ్చునప్పుడు ఏరీతిగా వచ్చును ? అనే ప్రశ్న మనకు తరచు ఉద్భవింపవచ్చును. ఆయన వ్యక్తిగతముగా, తానే వచ్చునని బైబిలు బోధించుచున్నది. "ఆర్భాటము తోను, ప్రధాన దూత శబ్దముతోను, దేవుని బూరతోను పరలోకము నుండి ప్రభువు దిగివచ్చును" అని 1 థెస్స 4:16లో వ్రాయబడియున్నది. ఆయన తన దూతలతో కూడ వచ్చునని మత్తయి 25:31లో వ్రాయబడియున్నది. అంతేకాదు, ఆయన అందరకు కనబడురీతిగా రాబోవుచున్నాడు : "ఇదిగో ఆయన మేఘారూఢుడై వచ్చుచున్నాను, ప్రతి నేత్రము ఆయనను చూచును, ఆయనను పొడిచిన వారును చూచెదరు, భూజనులందరు ఆయనను చూచి రొమ్ము కొట్టుకొందురు, అవును ఆమెన్" అని ప్రకటన 1:7లో వ్రాయబడి యున్నది. ఆయన మేఘముల గుండా పరలోకమునకు కొనిపోబడెను గనుక మేఘారూఢుడై తిరిగి వచ్చునని అపొ.కా. 1:11 బోధించుచున్నది. ఆయన తన మహిమ ప్రభావములతో రాబోవుచున్నాడు (మత్తయి 25:31, 16:27, తీతు 2:13).

## ఎందుకు వచ్చును ?

ఆయన మొదటిసారి పాపులను రక్షించుటకు వచ్చెను గదా ఆయన రెండవసారి ఎందు నిమిత్తము రాబోవుచున్నాడు ? అనే ప్రశ్న తరువాత మనకు రావచ్చును. ఆయన రెండవసారి వచ్చునప్పుడు ఏమి చేయునో అను సంగతిపై అనేక అసత్య సిద్ధాంతములు ఈ రోజులలో బోధింపబడుచున్నవి. ఆయన రెండవసారి వచ్చునప్పుడు ఈ భూమిపై తన రాజ్యమును స్థాపించి వెయ్యేండ్లు ఆయన పాలన చేయునని అనేకులు తలంచెదరు. నిజానికి బైబిలు అట్టి దేదియు బోధించుటలేదు. సరిగదా యేసు తన రాజ్యము ఈ లోకసంబంధమైనది కాదని ప్రకటించెను. (యోహాను 18:36). ఆయన రాజ్యము ఆత్మీయమైనది. అది మన మధ్యనే యున్నదని యేసు బోధించెను. (లూకా

17:21). ఆయన రాజ్యమే ఆయన సంఘము. ఎవరైతే క్రీస్తును నమ్మి, ఆయనను తమ ప్రభువుగా హృదయములో ప్రతిష్ఠించుకొని ఆయనకు విధేయులై యుందురో వారే ఆయన ఆత్మీయ రాజ్యమై యున్నారు. "ఆయన మనలను అంధకార సంబంధమైన అధికారములో నుండి విడుదల చేసి, తాను ప్రేమించిన తన కుమారుని యొక్క రాజ్య నివాసులనుగా చేసెను" అని అందుకే కొలస్సయిలో యున్న క్రైస్తవులకు అపొ.పౌలు వ్రాసెను. (కొలస్స 1:13). "మీ సహోదరుడను, శ్రమలలోను, రాజ్యములోను, సహనములోను పాలివాడనునైన యోహానను నేను" అని యోహాను తనను గూర్చి తాను పలికెను (ప్రకటన 1:9). మొదటి శతాబ్దమునాటికే రాజ్యము స్థాపింపబడి యుండని యెడల వీరు ఆ రాజ్యములో ఎట్లుండగలరు ? యేసు క్రీస్తు రెండవసారి వచ్చునప్పుడొక భూసంబంధమైన రాజ్యమును స్థాపించడు సరిగదా ఆయన తన రాజ్యమును తన తండ్రికి అప్పగించి వేయునని 1 కొరింథి 15:24 చెప్పుచున్నది. అది ఇట్లనుచున్నది : "అటు తరువాత ఆయన సమస్తమైన ఆధిపత్యమును, సమస్తమైన అధికారమును, బలమును కొట్టివేసి తన తండ్రియైన, దేవునికి రాజ్యము అప్పగించును, అప్పుడు అంతము వచ్చును".

## యేమేమి జరుగును ?

క్రీస్తు మరల వచ్చునప్పుడు యెరూషలేములో దావీదు సింహాసనము మీద నుండి పరిపాలించునని కొందరు తలంచెదరు. అయితే ఆయన మరల వచ్చునప్పుడు ఈ భూమియు, దానిమీద నున్న సమస్త కృత్యములును కాలిపోవునని 2 పేతురు 3:10 చెప్పుచున్నది. ఆయన రెండవసారి వచ్చునప్పుడు కాదు గాని మృత్యుంజయుడై లేచి పరలోకమునకు ఆరోహణ మవగానే ఆయన దావీదు సింహాసనముపై ఆసీనుడై యున్నాడని అపొ.కా. 2:30-34 బోధించుచున్నది. ఆయన మరల వచ్చునప్పుడు యూదుల నందరినీ పాలస్తీనాలో చేర్చుననియు, వారందరినీ క్రైస్తవులుగా మార్చుననియు కొందరి యభిప్రాయము. యేసుక్రీస్తు మృతులలో నుండి ఎప్పుడైతే లేచెనో అప్పుడే యూదులు దేవుని ప్రత్యేక జనాంగముగా తిరస్కరించబడియున్నారు. ఇప్పుడు యూదుడని, అన్యుడని, దాసుడని, స్వతంత్రుడని, పురుషుడని, స్త్రీ అని

భేదము లేదు. యేసుక్రీస్తు నందు మనందరము సమానులమే యని వాక్యము బోధించుచున్నది (గలతీ 3:28).

యేసుక్రీస్తు రెండవసారి వచ్చునప్పుడు మృతుల పునరుత్థానము జరుగును, మరణము సంపూర్ణముగా నాశనము చేయబడును. "దీనికి ఆశ్చర్యపడకుడి; ఒక కాలము వచ్చుచున్నది, ఆ కాలమున సమాధులలో నున్న వారందరు ఆయన శబ్దము విని మేలుచేసినవారు జీవ పునరుత్థానమునకును, కీడు చేసినవారు తీర్పు పునరుత్థానముకును బయటికి వచ్చెదరు" అని యేసు బోధించెను (యోహాను 5:28). "ఇదిగో మీకు ఒక మర్మము తెలుపుచున్నాను; మనమందరము నిద్రించము గాని నిమిషములో ఒక రెప్పపాటున కడ బూర మ్రోగగానే మనమందరము మార్పు పొందుదుము. బూర మ్రోగును; అప్పుడు మృతులు అక్షయులుగా లేపబడుదురు. మనము మార్పు పొందుదుము ... ఈ క్షయమైనది అక్షయతను ధరించు కొనినప్పుడు ఈ మర్త్యమైనది అమర్త్యతను ధరించుకొనినప్పుడు - విజయమందు మరణము మ్రింగివేయబడెను అని వ్రాయబడిన వాక్యము నెరవేరును" అని 1 కొరింధి 15:51 - 54లో అపొ.పౌలు వ్రాసెను.

క్రీస్తు రెండవసారి వచ్చునప్పుడు ఈ భూమ్యాకాశములు నాశనము చేయబడును. "అయితే ప్రభువు దినము దొంగ వచ్చినట్లు వచ్చును. ఆ దినమున ఆకాశములు మహాధ్వనితో గతించి పోవును, పంచభూతములు మిక్కటమైన వేండ్రముతో లయమైపోవును, భూమియు దానిమీదనున్న కృత్యములును కాలిపోవును" అని అపొ. పేతురు వ్రాసెను (2 పేతురు 3:10). ప్రకటన 20:11, 21:1 లను కూడ దయచేసి చదువండి.

## తీర్పు దృశ్యము

క్రీస్తు రెండవసారి వచ్చునప్పుడాయన మానవులందరికిని, ఆయనపై తిరుగుబాటు చేసిన దూతలకును తీర్పు తీర్చును. అంత్యదినమున జరుగు ఆ గొప్ప తీర్పు దృశ్యమును భక్తుడైన యోహాను ప్రకటన గ్రంధములో ఇట్లు వర్ణించెను:

"మరియు ధవళమైన మహా సింహాసనమును, దానియందు ఆసీనుడై యున్న యొకనివి చూచితిని, భూమ్యాకాశములు ఆయన సముఖము నుండి పారిపోయెను, వాటికి నిలువ చోటు కనబడకపోయెను. మరియు గొప్పవారేమి కొద్దివారేమి మృతులైన వారందరు ఆ సింహాసనము ఎదుట నిలువబడి యుండుట చూచితిని. అప్పుడు గ్రంథములు విప్పబడెను ... ఆ గ్రంథముల యందు వ్రాయబడి యున్నవాటిని బట్టి తమ క్రియలు చొప్పున మృతులు తీర్పుపొందిరి .. ఎవని పేరైనను జీవ గ్రంథమందు వ్రాయబడినట్టు కనబడని యెడల వాడు అగ్నిగుండములో పడవేయబడెను" (ప్రకటన 2:11-15). ఆయనపై తిరుగుబాటు చేసిన దూతల విషయమై పేతురు ఇట్లు వ్రాసెను. "దేవదూతలు పాపము చేసినప్పుడు దేవుడు వారిని విడిచి పెట్టక పాతాళలోకమందలి కటిక చీకటి గల బిలములోనికి త్రోసి, తీర్పుకు కావలిలో ఉంచబడుటకు వారిని అప్పగించెను" (2 పేతురు 2:4).

యేసుక్రీస్తు రెండవసారి వచ్చునప్పుడు భూమిపై నున్న ఆయన పరిశుద్ధ సంఘము ఆయనతో నిత్యము ఉండుటకై చేర్చబడును. అప్పుడు దేవుని నివాసము మనుష్యులతో కూడ ఉండును, ఆయన వారితో కాపుర ముండును, వారాయన ప్రజలై యుందురు, దేవుడు తానే వారి దేవుడై యుండి వారికి తోడైయుండును. ఆయన వారి కన్నుల ప్రతిబాష్ప బిందువును తుడిచి వేయును, మరణము ఇక ఉండదు, దుఃఖమైనను ఏడ్పైనను వేదనయైనను ఇక ఉండదు అని పరిశుద్ధాత్ముడు ప్రకటన 21:3,4లో బోధించుచున్నాడు. "ప్రియులారా, యిప్పుడు మనము దేవుని పిల్లలమై యున్నాము. మనమిక ఏమవుదుమో అది ఇంక ప్రత్యక్ష పరచబడలేదు గాని ఆయన ప్రత్యక్షమైనప్పుడు ఆయన యున్నట్లుగానే ఆయనను చూతుము గనుక ఆయనను పోలియుందుము" అని భక్తుడైన యోహాను వ్రాసెను (1 యోహాను 3:2).

యేసుక్రీస్తు మరల వచ్చునప్పుడు సువార్త యుగము అంతమగును. కాలము ఇక లేకపోవును. పరిశుద్ధులు క్రీస్తుతోను, దేవునితోను చేర్చబడుదురు గనుక ఇక బాప్తిస్మము, ప్రభు రాత్రి భోజనము అనునవి ఉండవు. ఏలయనగా వాటి అవుసరత ఇక లేకపోవును.

క్రీస్తు యొక్క రెండవ రాకడను గూర్చి గత రెండు సంచికలలో మనము దైవవేదము నుండి గమనించిన సత్యములను బట్టి ఆయన తన విశ్వాసులకు ఆదరణకరమైన వాగ్దానములను చేసెనని గ్రహించుకొనగలము. ఆయనకు విధేయత చూపు విశ్వాస జీవితమును జీవించిన యెడల పరలోకము మనదగును. క్రీస్తు యొక్క రెండవ రాకడను బట్టి దుర్మార్గులకు అవిశ్వాసులకు, అవిధేయులకు గొప్ప నాశనము సంభవింపబోవు చున్నదని ఆయన హెచ్చరించుచున్నాడు. క్రీస్తు ఈనాడు, ఈ ఘడియయందే వచ్చిన యెడల నీ పరిస్థితి యెట్లుండును ? నీవు సంతోషముతో ఆయనను ఎదుర్కొనగలవా ? లేక భయముతోను దుఃఖముతోను నీ రొమ్ము కొట్టుకొందువా ? ఆలోచించుకొనుము.

- జాషువా గూటం

# మరణమైన తరువాత - ఏమిటి ?

## After Death - What Then ?

(గత సంచిక తరువాయి)

## మృతులు ఎక్కడ ఉన్నారు ?

క్రీస్తును, సిలువపై నున్న దొంగయు ఆనాడే పరదైసులో యుందురని క్రీస్తు చెప్పినప్పుడు ఆయన అశరీరులుగా యున్న ఆత్మల విశ్రాంతి స్థలమును గూర్చి చెప్పెను. (యోబు 3:17; ప్రక 14:13). పరదైసులో ఉండుట యనగా నిస్పృహ గల స్థితిలో యుండుట యనిగాని, ఇక ఉనికి కలిగియుండక పోవుటయని గాని లేక పరలోకమనిగాని అర్ధము కాదు. క్రీస్తు పునరుత్థానుడైన 40 దినముల వరకు పరలోకమున కెక్కిపోలేదను దానిని గమనించుము (లూకా 24:50, 51; అపొ.కా. 1:3-11). యేసును, మారుమనస్సు నొందిన దొంగయు పరదైసులో కలసియున్న యెడల, యేసు మరణించిన తరువాత పాతాళమునకు వెళ్లినయెడల (అపొ.కా. 2:27,

31), పరదైసు పాతాళములో యున్నది. మరియు యేసును ఆ దొంగయు పరదైసులో కలసి యున్నప్పుడు పాతాళములో యుండిరి. గనుక లూకా 23:42లో యున్న పరదైసు రక్షింపబడిన వారి నిత్య నివాసము కాదు; ఏలయనగా క్రీస్తు చనిపోయినప్పుడాయన పరలోకమునకు వెళ్లలేదు.

ఆయన సిలువ వేయబడిన మూడు దినముల తరువాత క్రీస్తు యొక్క ఆత్మ పాతాళము నుండి వెడలి వచ్చెను. మరియు ఆయన శరీరము మృతులలో నుండి లేపబడెను. అయితే ఆ దొంగ యొక్క ఆత్మ పాతాళము నుండి వెడలి రాలేదు మరియు అతని శరీరము సమాధిలోనే యుండిపోయెను. పునరుత్థాన దినము వరకు అతని ఆత్మ పాతాళములోను, అతని శరీరము సమాధిలోను ఉండును. అదేవిధముగా అశరీరులైన ఆత్మలన్నియు వారి శరీరముల పునరుత్థానము వరకు పాతాళములోనే యుండును. అందువలన నీతిమంతుడు చనిపోగానే అతని ఆత్మ పరలోకమునకు వెళ్లుననియు, దుష్టుడు చనిపోగానే అతని ఆత్మ నరకమునకు వెళ్లుననియు కొందరు చెప్పు సంగతి తేటగా యున్న లేఖనములతో సమన్వయించుటలేదు.

క్రీస్తు యొక్క ఆరోహణము తరువాత నీతిమంతుల ఆత్మలు తక్షణమే పరలోకమునకు వెళ్లునని కొందరు చెప్పుదురు. పరదైసు ఇప్పుడు పరలోకమునకు బదలీ చేయబడెనను భావమునకు లేఖనములు చేయూత నిచ్చుటలేదు (అపొ.కా. 2:34).

ధనవంతుడు లాజరు కూడా పాతాళములో యుండిరి. అయితే వారిద్దరు ఒకే అరలో లేరు. ఏలయనగా వారిలో ఒకడు విశ్రాంతి పొందుచుండెను. మరొకడు యాతన పడుచుండెను. మరియు వారిద్దరి మధ్య గొప్ప అగాధ ముండెను (లూకా 16:23-26). లాజరు అబ్రాహాము రొమ్మున నుండెను. లూకా 23:43లో యున్న విశ్రాంతి స్థలమగు పరదైసు అని దీని అర్థము. మరణమైన తరువాత విశ్వాసుల ఆత్మలు ధన్యస్థితిలో ప్రవేశించును. పునరుత్థానము వరకు వారాస్థితిలో యుందురు. అటు తరువాత వారు నిత్య ఆనందములో ప్రవేశింతురు. అంతేకాకుండా, మరణమైన

వెంటనే నీతిమంతులకు ఒక ధన్యస్థానము ఎట్లున్నదో అట్లే దేవుని చిత్త ప్రకారము నడువని వారి కొరకు యాతనపడు ప్రదేశము పాతాళములో యున్నది. ధనవంతుడు మరణించగా పాతాళమునకు వెళ్లెను మరియు ఆ ప్రదేశములో అతడు నరకము (Gehenna) లో లేడు. నీతిమంతుల యొక్కయు దుర్మార్గుల యొక్కయు ఆత్మలు పాతాళములో యుండెను: ధనవంతుడు చీకటి (Tartarus) బిలములోను, లాజరు అబ్రాహాము రొమ్మునను ఉండిరి. తీర్పుకు ముందు, తీర్పు తరువాత కూడ భక్తిహీనులకు శిక్ష లభించును. "దుర్నీతిపరులను శిక్షలో ఉంచబడినవారిని తీర్పుదినము వరకు కావలిలో ఉంచుటకు ప్రభువు సమర్థుడు" (2 పేతురు 2:10). అశరీరులైన దుష్టుల ఆత్మలు చీకటి బిలములో పొందే శిక్షకును ఆఖరి తీర్పు తరువాత వారు పొందే నరక శిక్షకును గల వ్యత్యాసమును గమనించవలెను. పునరుత్థానము, తీర్పు తరువాత కలుగు నరక శిక్షలో శరీరాత్మలుండును (మత్తయి 10:28; 25:46).

పునరుత్థానమునకు ముందు పాతాళములో ఆనందమును, యాతనయు ఉండినను, కడపటి ఆనందము లేక శిక్షలు శరీరములు ఆత్మలతో పునరుత్థానమందు ఏకమగువరకు, తీర్పు జరుగువరకు కనిపెట్టవలెను; పాతాళములో మంచివారి యొక్కయు చెడ్డవారి యొక్కయు పరిస్థితి ఎట్లుండినను, పునరుత్థానమందు వారి స్థితి అదే రకమైన వేరొక పరిస్థితిలోనికి మార్చబడును.

సంగ్రహముగా పాతాళము (Hades) అనుపదము అశరీరులైన ఆత్మలు మరణమునకు పునరుత్థానమునకు మధ్యయుండు ప్రదేశమును సూచించుచున్నది. పరదైసు, చీకటి బిలము అనునవి పాతాళములోని రెండు అరలు; నరకమనునది పునరుత్థానము తరువాత కలుగు నిత్య శిక్షాస్థలము. గనుక తీర్పు తరువాత దుష్టులు ఉండే ప్రదేశము నరకము. పాతాళమనునది ఆఖరి శిక్షాస్థలమని లేఖనములలో ఎన్నడు వినియోగింపబడలేదు. సరిగదా నరకము అనుమాట వినియోగింపబడెను. దుష్టుల ఆత్మలు తీర్పు కొరకు కనిపెట్టుచుండు ప్రదేశమగు చీకటి బిలము (Tartarus) నరకము (Gehenna) కాదు. **(పశేషం)**

- పెద్రికోతీమ్

పాల్గొని చక్కటి వాక్యపరిచర్య చేసిరి. రాయప్పగారు వందన సమర్పణచేయగా సోదరులు యి.ప్రభాకరరావ్ గారి ప్రార్థనతో సదస్సు ముగిసెను. స్థానిక సంఘము హాజరైన వారందరికీ మంచి భోజన పానాదుల నేర్పాటుచేసిరి.

నిజదేవుని గూర్చి మనం ఆలోచిస్తున్నాం అంటే, అబద్ధదేవుండ్లున్నారని యర్థం. ఈలోకంలో పలు దేవుళ్లను, దేవతలను ఆరాధించేవారున్నారు. గాని నిజదేవుడు ఒక్కడే. "యెహోవానగు నేను నీకు దేవుడను, ఇశ్రాయేలు పరిశుద్ధ దేవుడనైన నేనే నిన్ను రక్షించువాడను" అని ఆయన చెప్పుచున్నారు. (యెషయా 43:3). ఆయనను తెలిసికొనాలంటే బైబిలు యిట్లు చెప్పుచున్నది : "మృగములను విచారించుము అవి నీకు బోధించును, ఆకాశపక్షులను విచారించుము అవి నీకు తెలియజేయును. భూమిని గూర్చి ధ్యానించిన యెడల అది నీకు బోధించును. సముద్రములోని చేపలును నీకు దాని వివరించును. వీటన్నిటిని బట్టి యెహోవా హస్తము వీటిని కలుగజేసెనని తెలిసికొనలేని వాడెవడు?" (యోబు 12:7-9). నిజదేవుడు సృష్టికర్త, జీవనదాత, సర్వశక్తిగలవాడు, "బలమును జ్ఞానమును ఆయనకు స్వభావ లక్షణ ములు" (యోబు 12:16). సర్వజ్ఞాని, సర్వాంతర్యామి; స్వయంభువుడు. అట్టి దేవుని అదృశ్యలక్షణములు అనగా ఆయన నిత్యశక్తియు, దేవత్వమును సృష్టింపబడిన వస్తువులను ఆలోచించుట వలన తేటపడుచున్నవి (రోమా 1:20). ఆయన ఆత్మయైన దేవుడు గనుక ఆయనను ఆత్మతోను సత్యముతోను ఆరాధించవలెనని సోదరులు తెలియజేసిరి.

భీమవరం గొల్లవాని తిప్పరోడ్‌లో యున్న క్రీస్తు సంఘం తరపున సోదరులు యస్.రాయప్పగారు దివారాత్రములు దేవుని కొరకు పాటుపడుచు ఆత్మలను సంపాదించుచున్నారు.

ఏప్రియల్ 25వ తేదీ సాయంత్రం భీమవరం ప్రకృతి ఆశ్రమం నెహ్రూకోలనీలో యున్న క్రీస్తు సంఘము ఏర్పాటుచేసిన కూటములో సోదరులు జాషువా గారు వాక్యపరిచర్య చేయగా ఇద్దరు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి. నెహ్రూకోలనీలో సోదరులు బి.జోషీరావ్ గారు సువార్త పనిచేయుచున్నారు.

ఏప్రియల్ 26వ తేదీ సాయంత్రం రామచంద్రపురం కుమ్మరవీధిలో యున్న క్రీస్తు సంఘము కృతజ్ఞత కూటము ఏర్పాటు చేయగా జాషువాగూటం గారు దానిలో పాల్గొనిరి. తదుపరి స్థానిక సంఘము నిర్మించ సంకల్పించిన ఆలయమునకు శంఖుస్థాపన చేసిరి. ఈ గొప్ప పనిని చేపట్టినందుకు స్థానిక సంఘమును అభినందించిరి. రామచంద్రపురం కుమ్మరవీధిలో సోదరులు యస్. లాజరస్‌గారు, వారి సతీమణి, కుమారుడు క్రీస్తు కొరకు గొప్పపనిని చేయుచున్నారు. స్థానిక సంఘము దినదినము అభివృద్ధిజెందుచున్నది.

ఏలూరు పత్తేబాదలోని క్రీస్తు సంఘము ఏప్రియల్ 25 నుండి 29 వరకు సువార్త కూటములు నిర్వహించిరి. ఏలూరు అశోక్‌నగర్‌లో అశోక్‌వర్ధన్ స్కూల్ గ్రౌండ్‌లో ప్రతిరాత్రి బహిరంగ సువార్త కూటములు నిర్వహించిరి. వందలాది ప్రజలు వచ్చి క్రీస్తు సత్యసువార్తను వినిరి. ప్రతి ఉదయం 9.00 గంటలకు బైబిలు తరగతులు నిర్వహించబడెను. "రక్షణ కలుగజేయుటకు సువార్త దేవుని శక్తియైయున్నది" యను దానిని ఈ కూటములకు ముఖ్య అంశముగా ఏర్పరచిరి. సోదరులు బి.జాషువా (ఏలూరు), బి.జీవన్ (విజయవాడ), పి.నాగభూషణం (జంగారెడ్డిగూడెం), సి.హెచ్..జేకబ్ (బెంగుళూరు), వి.సహదేవ్ (తాడేపల్లిగూడెం), మరియు జాషువా గూటం గార్లు వాక్య పరిచర్య చేసిరి. ప్రతిరాత్రి క్రీస్తు జీవితం రంగుల చలనచిత్రం ప్రదర్శించబడెను.

సువార్త కూటములు విజయవంతము చేయుటకు స్థానిక సంఘస్థులు గొప్ప కృషి చేసిరి. మరియు స్థానిక సువార్తికులు బి.జాషువా గారి కృషి ప్రసంశనీయము. పలు సంవత్సరముల నుండి సోదరులు బి.జాషువా గారు ఏలూరులో సత్యసువార్తను ప్రకటించుచు క్రీస్తు కొరకు మంచి ఫలితములను సాధించుచున్నారు. ఏలూరులోని సంఘము దినదినాభివృద్ధి జెందునట్లు ప్రార్థించుదాం.

RNI Regd. No. 69973/98
Postal Regd. No. VM/KD/05/2001

From:
**SATYA VAKKU**
**P.O. BOX 80,**
**KAKINADA - 533 001**

To

Edited & Published and Owned by Joshua Gootam & Published at Satya Vani-Church of Christ & Printed by him at Satya Vani Publications, Sambhamurthy St. KAKINADA - 533 004. Editor : Joshua Gootam